# అమృత వర్షిణి |

చీరకి అంచులాగ, మొహానికి చిరునవ్వులాగ, వనితకి వయ్యారంలా, ఇంటికి అలంకారమైనదేది? ఇల్లాలు (అఫ్‌కోర్స్) నెక్స్ట్.... స్టీలు గిన్నెలు (నో) సినిమా క్యాలెండర్లు, దేవుడి బొమ్మలు (నో, నో) గాడ్రెజ్ బీరువా, రేడియో గ్రాం, ఫర్నిచర్ (నో, నో, నో,) టేప్ రికార్డర్, నిలువుటద్దం, ఫ్రిజ్ డైర్, బొచ్చుకుక్కపిల్ల, బొమ్మలు ( పెయింటింగ్స్), పందిరిమంచం, డన్‌లప్ పరుపు, రబ్బరుదిండ్లు, పెద్ద పెద్ద దుప్పట్లు (నహీ, నహీ, నహీ) బోల్ రాధా బోల్.... "పిల్లలు" (ఎస్ ఎగ్జాట్లీ ....నెక్స్ట్)

"మీ మొహావూ, నా మొహావూను" షటప్పా మీరే షటప్పు!

పిల్లలకంటె, పెళ్ళాంకంటె యింటికి ముఖ్యమైన అలంకారం వుంటే మీరేచెప్పండి. (టెల్ మాన్) ఇంటికి దివ్యమైనటువంటి అలంకారం_ నాట్ చీరలు, నాట్ రవికలూ, నాట్ లుంగీలు, నాట్ లంగాలు బట్.... పుస్తకాలే- మైడియర్ పుస్తకాలే అంటారా! ఇంటికి, ఒంటికి, కంటికి పుస్తకాలను మించిన దివ్యమైనటువంటి అలంకారంలేదే.... లక్ష రూపాయల చెక్కు రాసి చేత్తోపట్టుకున్నా. అది చేతికి అలంకారం కాదే. పుస్తకం హస్తభూషణం అన్నారు మన ఓల్డు హేగ్స్. పుస్తకం చేత్తోపట్టుకుంటేనే చేతికి అలంకారం. "వాణికి నక్షదామశుకవారిజ పుస్తకరమ్యపాణికిన్" అన్నారు కాదా, "తల్లీ! నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్ నీవు నా యుల్లంబందున నిల్చి" అన్నాడు మిస్టర్ పోతన్న. "పుస్తకంలా పడుకున్నాడు" అంటారు. అంటే కదలకుండా మెదలకుండా అన్‌డిస్టర్‌బుడుగా (బుడుక్కాదు) పడున్నాడని అర్థం.

బాగా రాసినవీ, బాగా రాయనివి అని వుంటాయికాని పుస్తకాలలో మంచివీ, చెడ్డవీ అనేవి లేవని అన్నాడో వైల్డు. పాతవారపత్రికలను బైండ్లు కట్టించి లైబ్రరీలకు అంటగట్టి బిల్లులు ప్యాస్‌చేయించుకొనేవారట కొందరు పుస్తకవిక్రేతలు మరియు పబ్లిషర్లు, పాపము శమించుగాక. గృహాంతర్భాగ సౌందర్య నిర్ణేతలు (ఇంటీరియర్ డెకొరేటర్సు) అలంకారశాస్త్రజ్ఞులు ఎర్రబైండ్లు, పచ్చబైండ్లు, నీలం బైండ్లు, నల్లబైండ్లు అంటూ వర్ణవిచక్షణావిధానంమీద పుస్తకాలకు ఆర్డరిచ్చి తెప్పిస్తూవుంటారట. వంటింట్లో దేవాలయం వున్నట్లు ఇంటింటా గ్రంథాలయం వుండాల్సిందే. రంగురంగుల బైండ్లు చూడ్డానికి చాలా అందంగావుంటాయి. బోలెడు డబ్బుపోసి పుస్తకాలు కొనలేనివారు వార, మాస, పక్షపత్రికలను సైజుల వారీగా బైండ్లుచేయించి అలమార్లలో సర్దిపెడితే చూడముచ్చటగా వుంటాయి గోడలు, అలమార్లు. గదులూ- ట్రయిచేసి చూడండి. పుస్తకాలకు బూజుపడితే, పుస్తకాలే వదలకొట్టాలి చిలుకా అన్నారు ఎమెస్కో వేదాంతులు. పుస్తకాలు యింటికేకాదు మనసుకే ఓ గొప్ప అలంకారం. ఇద్దరు దెబ్బలాడుతున్న ఫ్రండ్స్‌కి చెరోపుస్తకం చేతిలోపెట్టేస్తే గమ్మున నోరుమూసుకు కూర్చుంటారు. ఒక అరకప్పు టీ త్రాగి మంచి పుస్తకం పుచ్చుగు ఓ మూలకూర్చుంటే మనసు పుష్పకవిమానం ఎక్కినట్లు వుంటుంది.

సాధారణ ప్రేమికులకీ, బుక్ లవర్స్‌కీ తేడావుంది. సాధారణ ప్రేమికుల ప్రేమ ఒకరికొకరు లభించగానే అంతమవుతుంది. బుక్ లవర్స్ ప్రేమ, పుస్తకాలు చదివినకొద్దీ పెరుగుతుంది "ఇంతింతై వటుడింతయై" అన్నట్లు. చదువుదామని అడిగి పుస్తకాలు ఎరువుపట్టుకెళ్ళి తిరిగి ఇవ్వనివారూ, పిల్లలూ, క్రిమికీటకాలు వీరే పుస్తకవిరోధులు. పుస్తకాలని రక్షించుకుందుకు గట్టి అట్టలూ, బీరువాలు తాళాలు కావాలి. పుస్తకప్రపంచంలో స్వేచ్ఛా ప్రణయం అమల్లోవుంది. ఎంతమంది చదివినా, ఎన్నోరకాలుగా మనోవికాసాన్ని కలుగచేసే స్వభావం. పుస్తకాలకు

న్నట్లు ప్రియురాళ్ళకు లేదేమో— పుస్తకం చదవడానికి వావీ వరుసల్తో నిమిత్తంలేదు. అందుకే చాలామంది పుస్తకప్రియులకు ప్రియురాళ్లు ఎవరోకాదు పుస్తకాలే. జబ్బుచేసినవారికి మల్టీవిటమిన్ టాబ్లెట్సు, టానిక్కులు, ఇంజక్షన్స్ ఇప్పిస్తాము. జబ్బుచేయనివారికి చేసినవారికికూడా పుస్తకాలు మంచి టానిక్కే అని చెప్పగలను. పిల్లలులేని యిల్లు యిల్లు కానట్టే పుస్తకాలులేని కొంప కొంపకాదు. పుస్తకాలకి రంగురంగుల అట్టలువేస్తూ కూర్చుంటేనే మనసుకు ఎంతో హాయిగావుంటుంది. కొత్త బట్టలు కట్టుకుని వెన్నెట్లో ఆడుకునే అందమైన అమ్మాయిలు గుర్తుకొస్తారు. కొత్తపుస్తకం తెరచి చదువుతూంటే కొత్తపెళ్ళాంతోకూర్చుని ముచ్చట్లాడినంత సొగసుగా వుంటుంది. పెళ్ళిపందిరి వాసన. కొత్తచీర వాసన, కొత్తపుస్తకం వాసన అంటే నాకెంతో యిష్టం.

పుస్తకాలు ఎంతో మంచి మనసిచ్చే నేస్తాలు. మనకు లేమిలోనూ, కలిమిలోనూకూడా వుండి మనసుకు సేదతీర్చేవి, హాయికూర్చేవి, ప్రేమనిచ్చేవి అవే.

నేనొకప్పుడు యింట్లో ఎక్కడ చూసినా పుస్తకాలే అని తెగవిసుక్కునేదాన్ని. పుస్తకం పోయినా కనిపించకపోయినా మావారు పెంకులెగరకొట్టేసేవారు. దుద్దులుపోయాయండీ, ఉంగరంపోయిందండీ అంటే "పోతే పోయిందిలే" అని వూరుకునేవారు. దేర్ ఫోర్- ఈయనకు సంతింగ్ లైక్ మ్యాడ్‌నెస్ వుండాలనుకొన్నాను. బజార్లోకి కొత్తరకం చీరలొచ్చాయండీ అంటె "ఆహ్హా" అనేవారు. కొత్తపుస్తకం వచ్చిందనగానే కాతాలో రాయించి తెచ్చుకుని చదివేదాకా నిద్రపోయేవారుకాదు. మాకు బట్టలకొట్లలోనూ పచారీకొట్లలోనూ కాతాలు లేవులెండి. పుస్తకాల కొట్లో మావారికి తప్పకుండా కాతావుంటుంది.

పేదవాడికి పెళ్ళామే భార్య అయినట్లు కొంతమందికి పుస్తకాలే పెళ్ళావూ, పిల్లలూ, అన్నీనూ. పెళ్ళానికి పెట్టిన సొమ్ముకి పిల్లలు వడ్డీ అనుకుంటే సరిపోతుంది. పుస్తకాలకోసం ఖర్చుపెట్టినడబ్బుమీద వడ్డీ

రాదు. తల్లిదండ్రులకు తిండి పెడితేనూ వడ్డీ రాదు. దేవుళ్లు కనబడరు. కనబడకపోయినా వారికి ముట్టవలసినవి వారికి ముడుతూవుంటాయి. పుస్తకాలు అలాక్కాదు. అవి ప్రత్యక్షదేవతలు. చేతులకు బంగారుగాజులు కొనలేదని ఓమారు మావారికి అటాక్ యిచ్చాను యాంగ్రీగా. అప్పుడో పుస్తకం తెచ్చి చేతిలోపెట్టారు చదువుకోమని. నాకప్పటికి గాని తెలియలేదు. చేతిలోని పుస్తకం నిజంగా అమృతవర్షిణే. నం అడ్మైర్ బుక్స్— ఐ అడ్మైర్ బుక్స్!